# కానరాని కందిపప్పు!

- రేషన్‌దుకాణాల్లో ఆగిన సరఫరా
- అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వం
- పేదలపై ఆర్థికభారం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో పక్కాగా సరఫరా
- ప్రభుత్వ తీరుపై పేదల అసంతృప్తి


బనగానపల్లె సివిల్ సప్లైస్ గోడౌన్

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పేదలకు రేషన్‌దుకాణాల ద్వారా కందిపప్పు అందకపోవడం పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పేరుకు మూడు నెలలపాటు పప్పు పంపిణీ చేయగా,గత ఆరు నెలలుగా రేషన్‌దుకాణాల్లో కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కార్డుదారులు కందిపప్పుపై డీలర్లను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సరఫరా కావడం లేదనే సమాధానం వస్తోంది.

**గత ప్రభుత్వంలో పంపిణీ**

గత వైఎస్సార్‌సీపీ పాలనలో బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెరను కూడా కార్డుదారులకు అందించేవారు. కానీ ఇప్పుడు కందిపప్పు లభించక పేదల ఇళ్లలో వంటలో పప్పు కనిపించకపోవడం ఆవేదన కలిగిస్తోంది. కొందరు కిరాణా షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు చట్నీ, రసంలాంటి తక్కువ ఖర్చు వంటలతోనే కాలం గడుపుతున్నారు. బనగానపల్లె సివిల్ సప్లైస్ గిడ్డంగి పరిధిలోని అవుకు, బనగానపల్లె మండలాల్లో మొత్తం 96 చౌకదుకాణాల్లో 40,749 మంది కార్డుదారులు ఉన్నారు. నిత్యావసరాల ధరలు పెరుగుతున్న తరుణంలో రేషన్‌దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా నిలిపివేయడం వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది.

**మార్కెట్‌లో అధిక ధరలు**

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.120 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు. రేషన్‌దుకాణాల ద్వారా అయితే కిలో రూ.67కే లభించే అవకాశం ఉండేది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు మార్కెట్ ధరకు కొనలేక నిస్సహాయంగా ఉన్నారు. ఎన్నికల ముందు రేషన్‌దుకాణాల్లో పామాయిల్‌తో పాటు అన్ని నిత్యావసర సరకులు అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం చూపుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్టోబరు నెలలో కూడా కందిపప్పు సరఫరా జరగదనే సంకేతాలు అధికారులే ఇస్తున్నారని కార్డుదారులు చెబుతున్నారు. వంటకు బియ్యం ఒక్కటే సరిపోతుందా? పప్పు కూడా కావాలి కదా, ప్రభుత్వమే కందిపప్పు సరఫరా చేయకపోతే మేమెలా బతుకుతాం? అని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పుతో పాటు ఇతర నిత్యావసర సరకులను కూడా కార్డుదారులకు అందించే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**బనగానపల్లె నియోజకవర్గంలో రేషన్‌దుకాణాలు, కార్డుదారుల సంఖ్య**

| మండలం | రేషన్ షాపులు | కార్డుదారులు |
|---|---|---|
| బనగానపల్లె | 53 | 26,821 |
| కోవెలకుంట్ల | 33 | 12,410 |
| కొలిమిగుండ్ల | 34 | 11,921 |
| అవుకు | 41 | 13,928 |
| సంజామల | 32 | 12,311 |
| మొత్తం | 193 | 77,981 |


కందిపప్పు ప్యాకెట్లు

**కందిపప్పు సరఫరా చేయాలి**



ఎన్నికల సమయంలో కూటమి నేతలు రేషన్ షాపుల్లో అన్ని రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం రేషన్‌దుకాణాల్లో బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు. డీలర్లను కందిపప్పు అడిగితే ప్రభుత్వం నుంచి సరఫరా కాలేదని సమాధానం చెబుతున్నారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో కందిపప్పును అధిక ధరతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కందిపప్పును తక్కువ ధరకే ఇచ్చేవారు.

–మహబూబ్‌బాషా, కార్డుదారుడు, బనగానపల్లె

**హామీని అమలు చేయాలి**



గత ప్రభుత్వ హయాంలో పేదలకు కందిపప్పు అందేది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు గుప్పించారు. తీరా అధికారంలో వచ్చిన తర్వాత గతంలో ఇస్తున్న కందిపప్పుకు కూడా మంగళం పాడారు. పెరిగిన నిత్యవసర ధరలతో పేదలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకులు అందించి ఆదుకోవాలి. లేకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు.

–సుబ్బారెడ్డి సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, బనగానపల్లె

## క్లుప్తంగా

### కనులపండువగా లక్ష్మీనరసింహుని కల్యాణం


స్వామిని అలంకరిస్తున్న వేదపండితులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల కొండపై శ్రీదేవి,భూదేవి సమేతంగా కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం కల్యాణం జరిపించారు. ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా మహాసంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అహోబిలంకు చెందిన తొమ్మిది మంది వేదపండితుల బృందం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, హోమం, కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ప్రత్యేక పల్లకీలో ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

### హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

డోన్ టౌన్: విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేసిన ప్యాపిలి మండలం నేరేడుచెర్ల స్కూల్ హెచ్‌ఎం సాంబశివుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఇమిడి లక్ష్మణ సాయి డిమాండ్ చేశారు. సోమవారం డోన్‌లోని డిప్యూటీ డీఈఓ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో విద్యార్థి సంఘాలపై హెచ్‌ఎం తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. పవన్, వెంకటేష్, కిరణ్, వంశీ, మనోజ్, గోపినాథ్ ఉన్నారు.

### శుభకార్యం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ సంధాని బాషా కుమారుడు షేక్ అబ్దుల్ రజాక్ వివాహ రిసెప్షన్ స్థానిక షాదిఖానాలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, మూర్తుజావలి, ఖాజా హుసేన్ తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

### నేడు లేఔట్ యజమానులతో సమావేశం

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌పై లేఔట్ యజమానులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ సోమవారం తెలిపారు. 2025 జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ అయిన ప్లాట్లకు మాత్రమే రెగ్యులైజ్‌కు అర్హత ఉంటుందని పేర్కొన్నారు. ప్లాట్ యజమానులు ఎల్ఎస్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఆ బిల్లును ఉపసంహరించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

డోన్ టౌన్: పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని గంటలు పెంచే బిల్లును అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టకముందే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివరామ్, పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్ మాట్లాడారు. కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును రద్దు చేయాలని కోరారు. గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో పని గంటలు పెంచి కార్మికులకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. అధిక పని గంటల వల్ల కార్మికులు నష్టపోతారని తెలిపారు. బిల్లును ఉపసంహరించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### పాఠశాల మైదానం అభివృద్ధికి సహకారం


గాలి సీతారామిరెడ్డికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న మైదానాన్ని అభివృద్ధి చేయడంలో సహకారం అందించిన గాలి సీతారామిరెడ్డిని ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ.. మైదానం గుంతలతో నిండిపోయి విద్యార్థులు ఆటలాడే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. ఈ సమస్యను సీతారామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి తన సొంత ఖర్చుతో 35 టిప్పర్ల ఎర్రమట్టిని (గ్రావెల్) వేసి మైదానాన్ని చదును చేయించారని వివరించారు. ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, వరలక్ష్మి, లావణ్య, సరస్వతి, ముంతాజ్‌బేగం, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

## సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ

కోవెలకుంట్ల: రాష్ట్ర సృజనాత్మక, సంస్కృత కమిషన్ సహకారంతో నంద్యాలలో నిర్వహించిన రాయలసీమ స్థాయి సాంస్కృతిక పోటీల్లో కోవెలకుంట్ల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ఎంఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కళారాధన రజతోత్సవాల్లో ఏర్పాటు చేసిన పోటీల్లో జానపదనృత్యం సీనియర్ విభాగంలో లహరి బృందం ప్రథమస్థానం, ఆధునిక నృత్యంలో ఇదే బృందం రెండో స్థానంలో నిలిచిందన్నారు. తెలుగుతల్లి వేషధారణలో శశికళ, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో పౌర్ణమి ద్వితీయస్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారని తెలిపారు. విద్యార్థినులను హెచ్‌ఎం అరుణ కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

## కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల సత్తా


ప్రశంసా పత్రాలతో కరాటే విద్యార్థులు

డోన్: కర్నూలులోని బైరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగిన జాతీయస్థాయి 12వ కరాటే పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కటా విభాగంలో అశ్వర్థ్, తన్వి బంగారు పతకాలు, సాత్వి, మనోజ్ఞ, విహాస్, మహాలక్ష్మి, సూర్యతేజ, దాక్షాయణి వెండి పతకాలు, చక్రధర్, భానుప్రకాష్ కాంస్య పతకాలను సాధించారని కరాటే మాస్టర్ రమణ తెలిపారు. విజేతలకు కరాటే ఇండియా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కీర్తన్ కొండ్రు ప్రశంసా పత్రాలు, పతకాలను అందజేశారని తెలిపారు.

## ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శివపార్వతులకు అభిషేకం, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో అలంకరించి ఊరేగింపు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మాళేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వానరం దాడిలో ఇరువురికి గాయాలు


కోతి దాడిలో గాయపడిన అంకమ్మ

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్లలో సోమవారం సాయంత్రం వానరం దాడిలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీరాముల అంకమ్మ ఇంటి బయట కూర్చుని ఉండగా కోతి దాడి చేసి విచక్షణా రహితంగా కొరికింది. అక్కడి నుంచి వెళుతూ ఇదే గ్రామానికి చెందిన సోముల లింగమ్మ అనే మరో మహిళపై దాడి చేసింది. కోతి దాడిలో ఇద్దరి తలలపై బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంకమ్మ తలకు ఏకంగా 15 కుట్లు పడ్డాయి.

## ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యేనా?

- అవుకులో 92 పోస్టులు ఖాళీ

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యా శాఖ అధికారులు ప్రతి రోజు ఇతర పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై పంపించాల్సి వస్తోంది. అవుకు మండలంలో 33 ప్రాథమిక, 3 యూపీ, 13 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 49 పాఠశాలలు ఉన్నాయి. 205 మంది ఉపాధ్యాయులు పని చేయాల్సి ఉండగా 113 మంది మాత్రమే ఉన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులే 63 ఖాళీ ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి 92 ఖాళీలు ఏర్పడ్డాయి. దాదాపు మూడు నెలల క్రితం బదిలీలు నిర్వహించారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులను కొత్త వాళ్లు వచ్చే వరకు రిలీవ్ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. డీఎస్సీ నిర్వహణ ప్రక్రియ పూర్తి కావడంతో మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అవుతాయా లేదా అనే అనుమానాలు విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది.

## మోక్షగుండం సేవలు చిరస్మరణీయం




డోన్: ఈఈ కమలాకర్‌రావును సత్కరిస్తున్న ఉద్యోగులు,బనగానపల్లె: నివాళులర్పిస్తున్న తాపీమేస్త్రీల సంఘం నేతలు

డోన్ టౌన్: దేశం గర్వించదగ్గ ఇంజినీర్, భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం అని విద్యుత్‌శాఖ ఈఈ కమలాకర్ అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని సోమవారం డోన్ విద్యుత్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఈఈ కమలాకర్‌ను విద్యుత్‌శాఖ ఉద్యోగులు సత్కరించారు.

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని యు.కొత్తపల్లె హైస్కూల్లో సోమవారం ఇంజినీర్స్ డేను జరుపుకున్నారు. అతిథిగా ఎంఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రభాకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రామ్మోహన్, మురళీధర్, రఘునాథ్, భాగ్యలక్ష్మి, విద్య కమిటీ చైర్మన్ మగ్బుల్ పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: నవభారత నిర్మాత మోక్షగుండం విశ్వేశ్వర్య ఇంజినీరింగ్ రంగంలో చేసిన కృషి అపారమని తాపీమేస్త్రీల సంఘం గౌరవాధ్యక్షుడు, సివిల్ ఇంజినీర్ మక్బుల్ హుస్సేన్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీల సంఘం కార్యాలయంలో ఇంజినీర్స్ డేను నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, ప్రసిద్ధ కట్టడాల నిర్మాణంలో విశ్వేశ్వరయ్య విశేష పాత్ర వహించారని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మేస్త్రీలు గొండబాబు, సుబ్బయ్య, వలి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ దాడులు


ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బేతంచెర్ల: పట్టణంలోని శ్రీకృష్ణ, శ్రీలక్ష్మి ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఏఓ విశ్వనాథ్, పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు చేశారు. మొత్తం 22 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లో తేడాలను గుర్తించారు. వీటి విక్రయాలను నిలుపుదల చేశారు. ఏఓ విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన




ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, డోన్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కోవెలకుంట్ల: డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు సోమవారం నుంచి ఉద్యమబాట పట్టారు. ఇందులో భాగంగా స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ఉద్యోగులు ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈ రామమోహన్ ఆధ్వర్యంలో మొదటి రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగులకు నగదు రహిత వైద్య అందించాలని, 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు అందజేయాలని, తదితర 13 రకాల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 22వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

**విద్యుత్ ఉద్యోగుల నిరసన**

డోన్ టౌన్: సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఉద్యోగులు సోమవారం స్థానిక ఈఈ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగ సంఘం జేఏసీ డోన్ డివిజన్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ..ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జేఏసీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, రామాంజనేయులు, వెంకటరాముడు నాయక్, మద్దిలేటి, ఆదిలక్ష్మీ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

డోన్ టౌన్: మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో సోమవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన తిమ్మక్క తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆమెను డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

## ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని వెంకటగిరి గ్రామానికి చెందిన తుపాకుల తిమ్మయ్య పొలంలోని కంది పంటను అదే గ్రామానికి చెందిన రామళ్లకోట సుబ్బమ్మ, ఆమె కొడుకు రామాంజనేయులు, కుమార్తె హనుమక్క నాశనం చేశారు. బాధితురాలు తిమ్మయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు.

## దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని కైప గ్రామానికి చెందిన వృద్ధురాలు దాసరి ఆరోగ్యమ్మపై అదే గ్రామానికి చెందిన చిన్నమద్దిలేటి, అతని భార్య షంషాద్, గౌరీ మాణిక్యమ్మ దాడి చేశారు. గ్రామంలో స్థల వివాదం కారణంగా ఆదివారం వాగ్వాదం జరగగా, వారు ఆమెపై దుర్భాషలాడి, దాడి చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆరోగ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం


బహుమతులు ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

బేతంచెర్ల: గోరుమానుకొండ గ్రామ సమీపంలోని ఎంజేపీ హైస్కూల్‌లో సోమవారం హిందీ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ దేవేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర గుప్తా, ప్రశాంతి పాల్గొన్నారు.

## లేఔట్ యజమానులకు నోటీసులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా అనధికారికంగా లేఔట్లు వేసిన యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ సోమవారం తెలిపారు. లేఔట్లు వేసిన బోయ శ్రీనివాసులు, నాగిరెడ్డి, వెంకట మోహన్‌బాబు, మధు, జూలకంటి రెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, దస్తగిరి, శివ, జక్కా జ్యోతిలకు నోటీసులు జారీ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేఔట్లు వేశారని, లేఔట్‌లో వేసిన నంబర్ రాళ్లు, ముళ్ల కంచ, రోడ్డును తొలగించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. దొర్నిపాడు మండలం గుండుపాపలకు చెందిన సైమన్ అనే యువకుడు సంజామల మండలం ఆర్ లింగందిన్నెలో బంధువుల పెద్దకర్మ కార్యక్రమానికి వచ్చాడు. అనంతరం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మండలంలోని జోళదరాశి ములువవద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో తలకు బలమైన గాయలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

## పాఠశాలకు క్రీడా పరికరాలు విరాళం

సంజామల: మండలంలోని కానాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి దూదేకుల మహబూబ్ షరీఫ్ రూ.6 వేల విలువైన క్రీడా సామగ్రిని సోమవారం విరాళంగా అందజేశారు. హెడ్‌మాస్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందించారు. చదువుతో పాటు క్రీడలు కూడా అంతే ముఖ్యమని షరీఫ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్న మౌలాలి, దీప్లా నాయక్, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


పశువులకు టీకా వేస్తున్న వెటర్నరీ ఏడీ

బేతంచెర్ల: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అక్టోబర్ 15వ తేదీ వరకు వేయనున్నట్లు వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి తెలిపారు. సోమవారం మండల కేంద్రం బేతంచెర్లతో పాటు గోరుమానుకొండ, అంబాపురం, పెండేకల్లు గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందని తెలిపారు. మగ పశువుల్లో పని సామర్థ్యం తగ్గుతుందన్నారు. ఆయా గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ సిబ్బంది వచ్చినప్పుడు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని ఏడీ సూచించారు.

## టమాట రైతులను ఆదుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

ప్యాపిలి: గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోతున్న టమాట రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ప్యాపిలి టమాట మార్కెట్‌లో రైతుల సమస్యలు తెలుసుకున్నారు. రైతుల నుంచి ప్రభుత్వమే టమాట కొనుగోలు చేయాలన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి టమాట సాగు చేసిన రైతుల కంటే వ్యాపారులు, దళారులే బాగుపడుతున్నారని అన్నారు. స్థానికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి స్వయంగా వచ్చి చూస్తే తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. సీపీఐ నంద్యాల, కర్నూలు జిల్లా కార్యదర్శులు రంగనాయుడు, గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నబీరసూల్, ప్యాపిలి మండల కార్యదర్శి గార్లదిన్నె మహేశ్, నాయకులు పిక్కిలి వెంకటేశ్, నారాయణ, రమమోహన్ పాల్గొన్నారు.